క్లుప్తంగా

మురుగు సమస్యకు పరిష్కారం



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మురుగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టిన ఎంపీడీఓ

గజపతినగరం: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా గజపతినగరం మండల కేంద్రంలో పలు ప్రధాన కూడళ్ల వద్ద మురుగునీరు స్తంభించిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్ సూర్యకుమారి, డీపీఓ నిర్మలాదేవి తక్షణమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎంపీడీఓ కిశోర్‌కుమార్, ఈఓపీఆర్డీ జనార్దనరావు తదితరులు శుక్రవారం మురగునీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు మరడాం విద్యార్థులు

దత్తిరాజేరు: రాష్ట్ర స్థాయి చెకుముకి క్విజ్ పోటీలకు మరడాం పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు సైన్స్ ఉపాధ్యాయుడు మహేశ్వరరావు తెలిపారు. వీరు కడప నగరంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. విద్యార్థులను హెచ్‌ఎం బంగార్రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

వాటర్ ప్లాంట్లలో ఆకస్మిక తనిఖీలు



వాటర్ ప్లాంట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

చీపురుపల్లి: పట్టణంలోని పలు వాటర్ ప్లాంట్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం విజిలెన్స్ డీఈఈ చందక సత్యనారాయణ నేతృత్వంలో ఆహార భద్రత, రెవెన్యూ అధికారుల బృందం పట్టణంలోని అక్షయ, కేవీఎస్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేశారు. ప్లాంట్ల నిర్వహణ, లైసెన్స్, అనుమతులు, నాణ్యత తదితర అంశాలను పరిశీలించినట్లు డీఈఈ తెలిపారు. ఫుడ్ సేఫ్టీకి సంబంధించిన పలు పత్రాలు రెన్యువల్ చేసుకోవాల్సి ఉందని, నిబంధనలు ప్రకారం ప్లాంట్లు నిర్వహించాలని సూచించినట్లు చెప్పారు.

ఆక్రమణల తొలగింపు



జేసీబీతో ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ గ్రామంలోని మొండివీధిలో రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేసిన కాలువలు, సిమెంటు గచ్చును స్థానిక సర్పంచ్ పైడపునాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం జేసీబీతో తొలగించారు. కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేయడం వల్ల మురుగునీరు ప్రవహించకపోవడంతో స్థానికులు వ్యాధుల బారిన పడుతున్నారని సర్పంచ్ పైడపునాయుడు తెలిపారు. కబ్జాలను తొలగించి కాలువల్లో మురుగునీరు పోయేలా చర్యలు తీసుకుంటామన్నారు.

సారా కేసులో ఇద్దరికి రిమాండ్

కొత్తవలస: సారాతో పట్టుబడిన ఇద్దరు మహిళలకు కొత్తవలస న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు ఎస్ఈబీ ఎస్సై నరేంద్ర శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామలింగాపురం గ్రామంలో ఎస్ఈబీ పోలీసులు సోదాలు నిర్వహించగా సిమ్మ పైడమ్మ అనే మహిళ 3 లీటర్ల సారాతో పట్టుబడింది. అలాగే విజయనగరం టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడుల్లో వేపాడ మండలం వావిలపాడు గ్రామానికి చెందిన లావేటి లక్ష్మి 2 లీటర్ల సారాతో పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా.. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించినట్లు చెప్పారు.

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



గుడివాడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీఓ పట్నాయిక్

వేపాడ: మండలంలో గుడివాడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ కేఎస్ఎన్‌కే పట్నాయక్ శుక్రవారం సందర్శించారు. కేంద్రంలో రికార్డులు, పిల్లలు హాజరు, పౌష్టికాహారం పంపిణీకి సంబంధించిన రికార్డులు తనిఖీ చేశారు. గర్భిణులకు పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పిల్లలు పూర్తి స్థాయిలో కేంద్రంలో ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్రం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వలంటీర్ వ్యవస్థపై విషపురాతలు తగవు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజల చెంతకు ప్రభుత్వ పథకాలు, సేవలు చేర్చుతున్నారని, అటువంటి వలంటీర్ వ్యవస్థపై రెండు ప్రధాన పత్రికలు, ఒక టీవీ ఛానల్(సాక్షి కాదు) విషపురాతలు రాస్తున్నాయని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆ రెండు పత్రికలు, టీవీ ఛానల్లు కలిసి వారి సామాజిక వర్గానికి చెందిన చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రభుత్వంపై, వలంటీర్ వ్యవస్థపై విషపురాతలు రాస్తున్నారని, కానీ ప్రజలు వాస్తవాలను గమనిస్తున్నారన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హుల ఇంటి వద్దకే చేరవేస్తూ.. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై తప్పుడు రాతలు తగవన్నారు. ఆనాడు చంద్రబాబు పాలనలో లంచం లేనిదే పని జరిగేది కాదని, గద్దల్లా ప్రజలను పీడించుకు తిన్న జన్మభూమి కమిటీలపై ఒక్క మాట కూడా ఆ రెండు పత్రికలు రాయలేదని దుయ్యబట్టారు. ఎలాగయినా చంద్రబాబును ముఖ్యమంత్రిగా గెలిపించడానికి ఆ పత్రికలు నానాతంటాలు పడుతున్నాయని అన్నారు. రూ.2లక్షల కోట్లను ప్రజలకు సంక్షేమ పథకాల రూపంలో నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లబ్ధిదారుల కాతాల్లో జమ చేసి పేదలకు అండగా నిలిస్తే.. అది చూసి ఓర్వలేక బురద జల్లే ప్రయత్నం టీడీపీ చేయడం సరికాదని విమర్శించారు. రామోజీ, టీడీపీ దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్, రెండు పత్రికలు కలిసి వచ్చి ఎన్నిరాతలు రాసినా, రాజకీయ కుట్రలు పన్నినా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఏమి చేయలేరని బొత్స వారిని హెచ్చరించారు. కార్యక్రమంలో నారాయణమూర్తి రాజు, స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గారతవుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బూడి వెంకటరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కరణం ఆదినారాయణ, సీనియర్ నేతలు మండల సురేష్, బెల్లాన త్రినాథరావు, రేగ సురేష్(గోవింద), కర్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రహదారి భద్రతపై పోలీసుల ప్రచారం



గజపతినగరం: ర్యాలీలో పాల్గొన్న సీఐ అప్పలనాయుడు, ఎస్సైలు



చీపురుపల్లి: రాజాం రోడ్డులో హెల్మెట్ ధరించిన ప్రయాణికులకు చాక్లెట్లు పంపిణీ చేస్తున్న పోలీసులు

చీపురుపల్లి: రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా చీపురుపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.సంజీవరావు, ఎస్సై ఎ.సన్యాసినాయుడు శుక్రవారం రాజాం–చీపురుపల్లి ప్రధాన రహదారిలో రోడ్డు భద్రత నిబంధనలపై వినూత్నంగా ప్రచారం చేశారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వాహన చోదకులను నిలిపి వారికి చాక్లెట్లు పంపిణీ చేసి అభినందించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్ర నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. అనంతరం పట్టణంలోని జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాల విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

మహిళా పోలీసుల ర్యాలీ

గజపతినగరం: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గజపతినగరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎల్.అప్పలనాయుడు సూచించారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహిళా పోలీసులతో బైక్ ర్యాలీ నిర్వహించారు. గజపతినగరం పోలీస్ స్టేషన్ నుంచి వెంకటాపురం జంక్షన్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వాహనదారులు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గజపతినగరం, బొండపల్లి, ఆంధ్ర ఎస్సైలు గంగరాజు, రవి, సిద్దార్థ, హెడ్ కానిస్టేబుల్ ఎస్.అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

చుక్కమాంబ తీర్థమహోత్సవం ప్రారంభం



పూజలందుకుంటున్న చుక్కమాంబ అమ్మవారు

వేపాడ: మండలంలో అరిగిపాలెం గ్రామదేవత చుక్కమాంబ అమ్మవారి తీర్థ మహోత్సవం శుక్రవారం వైభవంగా ప్రారంభమైంది. మూడురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకురాగా.. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సోంపురం, హైదరాబాద్, విజయవాడకు చెందిన కళాకారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం మహిళల కోలాటం, తప్పెటగుళ్లు, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

కారు, ఆటో ఢీ

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై బారికివాని చెరువు వద్ద శుక్రవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. వైజాగ్ నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న కారు, పెదమానాపురం నుంచి బొబ్బిలి మండలం పిరిడి గ్రామానికి వెళ్తున్న ఆటో ఒకదానికొకటి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఆటో డ్రైవర్ గుంట రామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే 108 అంబులెన్స్‌లో విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసిన ఎస్.భూర్జవలస పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ప్రమాదంలో కారు రోడ్డు పక్కన బోల్తా పడినా, అందులో ఉన్న నలుగురు సురక్షితంగా బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలి



నాడు-నేడు నిధుల ఖర్చుపై ఇంజినీరింగ్ అధికారులను ఆరా తీస్తున్న ప్రవీణ్‌ప్రకాష్

- విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్
- జూనియర్ కళాశాలలో నాడు–నేడు పనులు పరిశీలన

గజపతినగరం: నాడు–నేడు పనులను ప్రణాళికాబద్ధంగా చేయడంతో పాటు వాటికి సంబంధించిన రికార్డులు, లెక్కలు పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్ ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను శుక్రవారం రాత్రి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కళాశాలకు నాడు–నేడు కింద వచ్చిన నిధుల ఖర్చు, చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు, ప్రహరీ, వుడ్ వర్క్స్, పెయింటింగ్, తాగునీరు, తదితర వాటికి సంబంధిత నిధులు ఖర్చు చేసినట్లు సిబ్బంది చెప్పగా..యేఏ పనులకు ఎంతెంత ఖర్చు చేశారో విడివిడిగా చెప్పాలని ఆయన అడగగా.. అధికారులు నీళ్లునమలడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కళాశాలలో నిర్మించిన టాయిలెట్లను పరిశీలించారు. ఆయన వెంట ఇంటర్మీడియెట్, సెకండరీ ఎడ్యుకేషన్ ఆర్‌జేడీలు శారద, జ్యోతి కుమారి, రెసిడెన్స్ స్కూల్ సెక్రటరీ నర్సింహరావు, డీవీఈఓలు మంజుల వీణ, సురేష్‌కుమార్, డీఈఓ లింగేశ్వర్‌రెడ్డి, బొబ్బిలి ఆర్డీఓ శేషశైలజ, ఎంఈఓ విమలమ్మ, ఎంపీడీఓ కిశోర్ కుమార్, తహసీల్దార్ అరుణకుమారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

గజపతినగరం: మండలం కేంద్రంలో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున వెంకట గాయత్రి రోడ్డు, కృష్ణారావు ఆస్పత్రి, తదితర ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు డీఈ శివకుమార్ తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో భరతమాత పూజ



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని నరపాం గ్రామంలో ఇవటూరి సత్సంగ్ భవనంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో భరతమాతకు శుక్రవారం పూజలు చేశారు. మన దేశ సంస్కృతి, సనాతన హైందవ ధర్మం, సాంప్రదాయాలను ఇవటూరి నారాయణశర్మ వివరించారు. అనంతరం గ్రామంలో శోభాయాత్ర, సత్సంగ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సబ్ డివిజనల్ కన్వీనర్ కొరుపోలు అప్పారావు, గ్రామ కన్వీనర్ ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

బోరుకు విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరణ

లక్కవరపుకోట: మండలంలోని రంగాపురం గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంక్‌కు సరఫరా చేసే బోరుకు విద్యుత్ కనెక్షన్‌ను అధికారులు శుక్రవారం పునరుద్ధరించారు. గ్రామంలోని రక్షిత మంచినీటి ట్యాంకుకు సంబంధించిన బోరును అధికారులు గతంలో గ్రామంలోని ప్రైవేటు స్థలంలో ఏర్పాటు చేశారు. అయితే దీనిపై స్థల యజమాని తన స్థలంలో ఉన్న బోరును తొలగించాలని గతంలో అధికారులకు నోటీసులు పంపి, విద్యుత్ కనెక్షన్ తొలిగించాడు. గ్రామస్తులకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో అత్యవసర పరిస్థితిలో విద్యుత్ కనెక్షన్‌ను కలిపారు. దీనిపై సదరు స్థల యజమాని కోర్టులో దావా వేశారు. ప్రస్తుతం ఈ విషయం కోర్టు పరిధిలో ఉంది. ఇది ఇలా ఉండగా గత డిసెంబర్ 12న విద్యుత్ కనెక్షన్‌ను ఎవరో తొలగించారు. దీంతో గ్రామస్తులకు తాగునీటి ఇబ్బందులు మొదలయ్యాయి. దీనిపై వారు జిల్లా స్పందనలో ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ టి.రామకృష్ణ, ఎంపీడీఓ కె.రూపేష్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చంద్రకళ, పోలీసు బందోబస్తు మధ్య శుక్రవారం విద్యుత్ కనెక్షన్‌ను తిరిగి పునరుద్ధరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ జి.జ్ఞానేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి రహమాన్, వైస్ ఎంపీపీ ఆవాల శ్యామల, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవాల సత్యనారాయణ పాల్గొన్నారు.

108 శివలింగాలకు రుద్రాభిషేకం



108 శివలింగాలకు రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలో ఉన్న సాయిబాబా ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా శుక్రవారం 108 శివలింగాలకు మహారుద్రాభిషేకం నిర్వహించారు. వేదశ్రీ అంపోలు ఉమామహేశ్వరరావు మంత్రోచ్ఛరణల మధ్య రుత్వికులు శాస్త్రోక్తంగా అభిషేకాన్ని పూర్తి చేశారు. పూజా కార్యక్రమంలో కిరణ్‌కుమార్ శర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

దూడల సంరక్షణపై అవగాహన తప్పనిసరి

- పశుసంవర్ధక శాఖ జేడీ వై.వి.రమణ



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ జేడీ వై.వి.రమణ

బొండపల్లి: ఆవుదూడల సంరక్షణపై పాడిరైతులు సరైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ వై.వి.రమణ అన్నారు. మండలంలోని నెలివాడ ఆర్బీకేలో పశు విజ్ఞానబడి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ రాష్ట్రీయ గోకుల్ మిషన్ సౌజన్యంతో ప్రభుత్వం పెయ్యిదూడల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రైతులకు రాయితీపై పశు దాణాతో పాటు పచ్చిగడ్డి విత్తనాలు అందిస్తున్నట్లు చెప్పారు. కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు పశుసంవర్ధక శాఖ ద్వారా పాడిరైతులకు అందించే రుణాలు, రాయితీలను వివరించారు. ఆవు దూడలు పెంపకంలో మెలకువలను తెలుసుకోవడంతో పాటు, వ్యాధులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే మంచి లాభాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు ఎ.రామచంద్రరావు, విజయనగరం పశువైద్యాధికారి పి.రామోహ్మనరావు, వి.టి.అగ్రహారం వైద్యాధికారి కిరణ్‌కుమార్, పి.సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తాళ్లపూడి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పని



బొండపల్లి: అంబటివలసలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: ఉపాధి జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతీ వేతనదారుకు తప్పనిసరిగా పని కల్పించాలని ఎంపీడీఓ ఎ.వేదవతి అన్నారు. మండలంలోని అంబటివలస, నెలివాడ గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. వేతనదారులు నిబంధనల ప్రకారం పని చేస్తే వేతనాలు గిట్టుబాటు అవుతాయన్నారు. నిర్ణీత పని వేళలను పాటించాలని సూచించారు. అనంతరం నెలివాడ సచివాలయాన్ని పరిశీలించారు. సచివాలయం ఉద్యోగులు అందరూ విధిగా జాబ్ చార్టుకు అనుగుణంగా పని చేయాలని సూచించారు. ఆమె వెంట ఏపీఓ బి.కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

జాబ్‌కార్డులు మంజూరు

దత్తిరాజేరు: గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చేయాలనుకునే వారికి జాబ్‌కార్డులు వెంటనే మంజూరు చేయడం జరుగుతుందని ఏపీఓ సత్యవతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో కార్డు పొందని వారు సంబంధిత క్షేత్రసహాకుల ద్వారా జాబ్‌కార్డులు పొందవచ్చన్నారు. ఆధార్ కార్డ్, రేషన్‌కార్డులు జిరాక్స్‌లు గ్రామ సచివాలయంలో అందచేస్తే జాబ్‌కార్డు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

శివరాత్రి ఏర్పాట్లపై పంచాయతీ సమావేశంలో చర్చ



పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

శృంగవరపుకోట: స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓ పాత్రో నేతృత్వంలో ఎస్.కోట మేజర్ పంచాయతీ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశానికి సర్పంచ్ సంతోషికుమారి, వైస్ సర్పంచ్ ఎం.కుమార్ సహా వార్డు సభ్యులు హాజరయ్యారు. అజెండాలో చేర్చిన అంశాలపై చర్చించారు. శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లపై ఉపసర్పంచ్ మోపాడ కుమార్ వివరణ కోరగా పంచాయతీ ఉద్యోగులు వివరణ ఇస్తూ రోడ్ల తడపటం, చలివేంద్రాలు, మరుగుదొడ్లు ఏర్పాటు, వీధుల్లో విద్యుత్ దీపాల అలంకరణ చేయనున్నట్లు చెప్పారు. అందుకు అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పెట్టారు. మరో వార్డు సభ్యుడు శేషగిరి ఇంటి పన్ను వసూలుపై ప్రశ్నిస్తూ తగిన రికార్డులు చూపాలని పట్టుబట్టగా.. అజెండాలో సూచించిన అంశాలపై చర్చ జరగాలని, సభ్యులు ఎవరికి ఏ రికార్డులు కావాలన్నా పంచాయతీ కార్యాలయం పనివేళల్లో వచ్చి అడిగితే అందించే ఏర్పాటు చేస్తామని ఈఓ బదులిచ్చి సమావేశాన్ని ముగించారు.

విద్యార్థులకు ఉచితంగా కుల, ఆదాయ ధ్రువపత్రాలు



దేశపాత్రునిపాలెం జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ వై.పద్మజ

కొత్తవలస: ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తగరతి, ఇంటర్ చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఆదాయం, కులం ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ వై.పద్మజ తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నుంచి ఆదేశాలు జారీ అయినట్లు చెప్పారు. మండలంలోని దేశపాత్రునిపాలెం సమీపంలో జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలపై ఆరా తీశారు. కేంద్రంలో 5 సంవత్సరాల లోపు చిన్నారులకు ఉచితంగా సేవలు అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల హాజరు, భోజన మెనూను పరిశీలించి పలు సూచనలు చేశారు.

జోరుగా విద్యార్థుల పాద కొలతల సేకరణ



లక్కవరపుకోట ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థుల పాద కొలతలు నమోదు చేస్తున్న టీచర్

కొత్తవలస: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం ఏడాదికి రెండు జతల షూలను అందిస్తోంది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి విద్యార్థులకు షూలు అందించేందుకు ఇప్పటి నుంచే చర్యలు ప్రారంభించింది. ఇందుకు సంబంధించి విద్యార్థుల పాద కొలతలను ఉపాధ్యాయులు సేకరిస్తున్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్లు హెచ్‌ఎంలు తెలిపారు. జిల్లాలో 1752 ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు లక్షా 53 వేల మంది విద్యార్థులకు వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభించే నాటికి షూను అందజేయనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

185 మందికి వైద్యసేవలు

గజపతినగరం రూరల్: మండలంలోని కాళంరాజుపేటలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు బి.వేళంగిణి ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 185 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారికి, గర్భిణులకు వైద్యసేవలు అందించారు.

వీఆర్వో సస్పెన్షన్‌పై విచారణ



గ్రామ సచివాలయంలో విచారణ చేస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వెంకటేశ్వరరావు

వేపాడ: మండలంలో కొండగంగుబూడి వీఆర్వో సస్పెన్షన్‌పై బొబ్బిలి ల్యాండ్ ఎక్విజేషన్ స్పెషల్ డిప్యూటీ కలెక్టరు వి.వెంకటేశ్వరరావు శుక్రవారం విచారణ చేపట్టారు. వీఆర్వో పనితీరుపై ఇటీవల గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశార. దీనిపై స్పెషల్ డిప్యూటీ కలెక్టరు గ్రామ సచివాలయంలో గ్రామపెద్దలు, గ్రామస్తుల నుంచి వివరాలు సేకరించారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు చెప్పారు. ఆయనతో పాటు ఉపతహసీల్దార్ సన్యాసినాయుడు ఉన్నారు.